క్లుప్తంగా

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం


ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ అధికారులు

ఎన్పీకుంట: మండలంలోని సచివాలయాల్లో ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆదినారాయణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 73 మందికి ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొంత ఆలస్యమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న ఓంకారేశ్వరుడు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓంకారేశ్వరున్ని వివిధ రకాల పండ్లతో అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

నివేశన స్థలాల మంజూరుకు వినతి

ఎన్పీకుంట: నివేశన స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ నరేంద్రకుమార్కు పలువురు వినతి పత్రాలు అందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్నగర్ కాలనీ,వంకమద్ది పంచాయతీ వంకమద్ది, గురికానివారిపల్లి, పెద్దరాంపల్లి గ్రామాలకు చెందిన పలువురు మండల కేంద్రానికి సమీపంలోని సర్వే నంబరు 143-6లో గల ప్రభుత్వ భూమిలో తమకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, నిర్మాణాలు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. అలాగే వంకమద్ది గ్రామానికి హిందూ శ్మశానవాటిక కోసం ప్రభుత్వ భూమిని గుర్తించి పట్టా మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో మొత్తం 6 అర్జీలు వచ్చాయని, ఇందులో 5 ఇంటి పట్టాల మంజూరు కోసం రాగా భూసమస్యపై ఒక అర్జీ వచ్చిందని తెలిపారు.

విద్యా సంస్థల మంజూరుకు కృషి చేయండి


మక్బూల్ అహ్మద్కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కదిరి నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ను ముస్లిం మైనార్టీ రైట్స్ ఫోరం నాయకులు షాకీర్ ఖాన్ కోరారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. పట్టణంలో శ్మశానవాటికకు 4 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. నియోజకవర్గంలోని వక్ఫ్ భూములతో సంపద సృష్టించి పేద ముస్లింలకు ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

తనకల్లు: స్థానిక కోటూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నేడు (మంగళవారం) విద్యుత్కు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


కృష్ణారెడ్డికి పింఛను డబ్బు అందజేస్తున్న వలంటీర్ శివకుమార్

తనకల్లు: మండల పరిధిలోని బాలసముద్రం గ్రామానికి చెందిన వృద్ధుడు పోలం కృష్ణారెడ్డి అనారోగ్యంతో తిరుపతిలోని బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ వాల్మీకి నక్కల శివకుమార్ సోమవారం తెల్లవారుజామున హాస్పిటల్కు వెళ్లి పింఛన్ డబ్బు రూ. 3 వేలు అందజేశాడు. వలంటీర్ శివకుమార్ తన సొంత ఖర్చుతో తిరుపతికి వెళ్లి పింఛను డబ్బు అందజేయడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రబీ సాగు.. బహు బాగు

పుట్టపర్తి అర్బన్: నీటి లభ్యత, ప్రభుత్వ సహకారం, శాస్త్రవేత్తల సలహాలతో జిల్లా రైతులు ఉత్సాహంగా రబీ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్లో వర్షాలు తక్కువగా కురిసినా భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో పలు రకాల పంటలను సాగు చేశారు. ఇప్పటికీ పలు చెరువులు, హంద్రీనీవాలో నీళ్లు సంవృద్ధిగా ఉండడంతో వ్యవసాయానికి ఎటువంటి ఢోకా లేకుండా పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో మరో ఆలోచన లేకుండా బోరు బావులు ఉన్న రైతన్నలు వ్యవసాయం బాట పట్టారు. దీంతో పాటు గత ఏడాది 'జల కళ' పథకంలో బోర్లు వేయడంతో చాలా మంది రైతుల మోటర్లను ఏర్పాటు చేసుకొని వ్యవసాయం సాగిస్తున్నారు. కొంత మంది రైతులకు ప్రభుత్వం మోటర్లు, స్టార్టర్లు, పైపులు ఉచితంగా అందజేసి ప్రోత్సహించింది. ఇప్పటికే పంటలను సాగు చేయడం పూర్తి కావడంతో రబీలో ఈ క్రాప్ నమోదుకు వ్యవసాయాధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 34,212 హెక్టార్లలో సాగు..

జిల్లాలో ఉద్యాన పంటలతో పాటు ఈ ఏడాది రబీ పంటలను సైతం సాగు చేశారు. మామిడి, చీనీ, జామ, దానిమ్మ, ఇతర కూరగాయల పంటలు సుమారు 64 వేల హెక్టార్లలో సాగు చేయగా వాణిజ్య పంటలైన వేరుశనగ, వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, రాగి, పత్తి, జొన్న పంటలను పెద్ద ఎత్తున సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో రైతులంతా బోరు బావులపైనే ఆధార పడి ఉదయం నుంచి విద్యుత్ సరఫరా సమయాల్లో వ్యవసాయ తోటల వద్దే ఉంటున్నారు. సుమారు 18 రకాల పంటలను 34,212 హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఇందులో అధికంగా వేరుశనగ 17,712 హెక్టార్లు, మొక్కజొన్న 3,114 హెక్టార్లు, వరి 3,506 హెక్టార్లు, రాగి 884 హెక్టార్లు, శనగలు 2,508 హెక్టార్లు, టమాట 1,603, హెక్టార్లు, సన్ ఫ్లవర్ 369 హెక్టార్లు, మిరప 66 హెక్టార్లతో పంటలు సాగు చేశారు.


నల్లమాడ వద్ద సాగవుతున్న వేరుశనగ పంట


గోరంట్ల మండలంలో మొక్కజొన్న పంటకు స్ప్రింక్లర్లతో నీటి తడులు


పెదపల్లి వద్ద కళకళలాడుతున్న వరి పంట

సీఎం జగన్ నిర్ణయం అభినందనీయం


బుక్కపట్నంలో క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం


పుట్టపర్తిలో వాలీబాల్ క్రీడాకారులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

పుట్టపర్తి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న యువతీ, యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం నిర్వహించాలని సీఎం జగన్మోహన్రెడ్డి నిర్ణయించడం అభినందనీయమని పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తంగా ఓబులపతి, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి, కేశప్ప అన్నారు. సోమవారం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్రా'రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభను చాటడానికి క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్రా' గొప్ప వేదిక అయ్యిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నంలో..

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల ద్వారా సీఎం జగన్ లక్షలాది మంది క్రీడాకారులను పరిచయం చేశారని సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీపీ శ్రీధర్రెడ్డి అన్నారు. సోమవారం వారు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్రెడ్డి, పెయింట్ వెంకటేష్, పీడీ నాగరాజు, ఈఓఆర్డీ ఇందిర బాల, క్రీడాకారులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బడుగుల జీవితాల్లో వెలుగు


ఉస్తినిపల్లిలో వృద్ధులతో మాట్లాడుతున్న జుబేర్ సుల్తాన్

తనకల్లు: సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి వెలుగులు నింపారని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ కో కన్వీనర్ జుబేర్ సుల్తాన్ అన్నారు. మండల పరిధిలోని తిరుమలయ్యగారిపల్లి, కొండవెనుకపల్లి, కాటేపల్లి, ఉస్తినిపల్లి, గొల్లవారిపల్లి గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వం నుంచి ఏ ఏ పథకాలు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో తామందరం సంతోషంగా ఉన్నామని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పుడు అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకం తిరిగి అమలు చేసే సత్తా పేదల పక్షపాతిగా ముద్రపడిన సీఎం వైఎస్ జగన్కే ఉందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమన్నారు. కదిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్కు ప్రతి ఒక్కరూ అండగా ఉండి, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ గెలుపుకోసం తామందరం సైనికుల్లా పనిచేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాసిన్ బాబా, బాషా, వెంకటేష్, రాంచరణ్, షంషీర్, మణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..


రెస్టారెంట్లో శ్యాంపిళ్లు సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలోని ఆద్యా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. 'కళ్లకు ఇంపు.. తింటే ముప్పు' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించారు. జిల్లా ఇన్చార్జ్ రామచంద్ర ఆధ్వర్యంలో ఆద్యా రెస్టారెంట్లో ఆకస్మిక తనిఖీ చేశారు. కస్టమర్ల నుంచి పలు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేసినట్లు వివరించారు. వంటగదిలో సరుకును సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. శ్యాంపిళ్లను ల్యాబ్కు పంపిస్తామని.. 20 రోజుల తర్వాత రిపోర్టులు వస్తాయని తెలిపారు. కల్తీ వంటకాలు, నిల్వ ఉంచిన ఫుడ్ కస్టమర్లకు అందజేస్తే చర్యలు తప్పవని హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. హోటల్ నిర్వహించాలంటే ఫుడ్ టెక్నాలజీ అప్రూవ్ చేసిన సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. అంతేకాకుండా కస్టమర్లకు బిల్లులు ఇవ్వాలని.. లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వైభవంగా పెద్దమ్మస్వామి జ్యోతుల ఉత్సవం

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో సోమవారం పెద్దమ్మ, నల్లమ్మ స్వాములకు జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లను అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. తర్వాతా గ్రామంలోని మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాతా అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఊరి దేవర: తూంచర్ల గ్రామంలో మంగళవారం ఊరి దేవర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దమ్మ తల్లితో పాటు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, బలి తర్పణం చేస్తామన్నారు. ఉదయం 10 గంటల తర్వాతా గ్రామంలో విందు భోజనాలుంటాయన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నీటి సరఫరా ఉండదని మున్సిపల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సుబ్బరావుపేట గ్రామం వద్ద పైపు లైను లీకేజీ కారణంగా నీరంతా వృథాగా పోతోందని, మరమ్మతుల కోసం నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ వాసులు సహకరించాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: మండలంలోని గొల్లపల్లి శివార్లలో 28 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బలరామయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహమ్మదాబాద్కు చెందిన బాలాజీ అక్రమంగా మద్యం తరలిస్తున్నాడన్న సమాచారంతో వెళ్లి అతన్ని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని కోర్టుకు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట బీసీ కాలనీకి చెందిన రామచంద్ర సోమవారం విష గుళికలు మింగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించినట్లు స్థానికులు తెలిపారు.

కరపత్రాల విడుదల

ధర్మవరం రూరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి నాగభూషణం తెలిపారు. సోమవారం వారు సాంస్కృతిక మండలిలో కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శివయ్య, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్రెడ్డి, సోలిగాళ్ల వెంకటేశులు, మనోహర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నక్కలపల్లిలో గంగమ్మ జాతర


పూజలందుకుంటున్న గంగమ్మ దేవత

ముదిగుబ్బ: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. జాతరకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని గంగమ్మ జాతరను జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

'మదర్' ఇక లేరు..!


మదర్ ఎలిజబిత్ (ఫైల్)

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలో జీవన్జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన మదర్ ఎలిజబిత్ (94) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంత కాలంగా కుణుతూరు గ్రామం వద్ద ఉన్న ఆశ్రమంలో మదర్ ఉంటున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఆమె చాలా ఏళ్ల క్రితం ధర్మవరం పట్టణానికి వచ్చారు. జీవన్జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ స్థాపించారు. మదర్ కుటుంబ సభ్యులు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. వారు ఎంత బతిమాలినా వెళ్లలేదు. 'నాకు ధర్మవరం అంటేనే ఇష్టం.. ఈ నేలపైనే తుది శ్వాస వదులుతా' అని ఆమె అంటుండేది. మదర్ వద్ద చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. మదర్ ఎలిజబిత్ తన జీవిత చరమాంకంలో ఆశ్రమంలో ఉంటూ ఎంతో సాధారణ జీవితం గడిపారు. ఆమె మృతి పట్ల పలువురు పుర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా 'ఆసరా' సంబరాలు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పదో వార్డులో సోమవారం 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కవితా రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలారెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి, సీఓ ఆదినారాయణ, గాయత్రి గ్రామ సంఘం కార్యదర్శి హేమావతి, గాయత్రి గ్రామ సంఘం ఆర్తి, రజిని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కదిరిటౌన్: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కదిరి తహసీల్దార్ కార్యాలయంలో ఆశా కార్యకర్తలు సోమవారం వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు వేదవతి, అనిత, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం


నూతన ఎంపీడీఓను సన్మానించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నల్లమాడ: మండల పరిషత్ అభివృద్ధి నూతన అధికారిగా ఎండీ మహమ్మద్ దౌలా ఈనెల 2న బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు స్వాగతం పలుకుతూ దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, నాయకులు నరసింహమూర్తి, శంకర్నాయక్, ఆర్డబ్ల్యూఎస్ మండల ఇంజినీర్ శశికళ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామచంద్రారెడ్డి, ఏపీఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ సూర్యనారాయణకు అవార్డు


అవార్డుతో 'దోస్తాన్' సినిమా సభ్యులు

కదిరిటౌన్: పట్టణానికి చెందిన ప్రొడ్యూసర్, డైరెక్టర్ సూర్యనారాయణ బెస్ట్ తెలుగు ఫిలిం డైరెక్టర్ అవార్డు అందుకున్నారు. తిరుపతి నగరంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లో ఆయనకు అవార్డు అందించి సత్కరించారు. అలాగే బెస్ట్ తెలుగు కాన్సెప్ట్ సినిమాగా 'దోస్తాన్' ఎంపికైంది. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న డైరెక్టర్ సూర్య నారాయణ మాట్లాడుతూ 'దోస్తాన్' సినిమాకు అరుదైన గౌరవం దక్కడం ఆనందకరమన్నారు. సినిమా టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రంలో ముఖ్య పాత్రల్లో నటించిన సిద్ స్వరూప్, ఆర్ కార్తికేయ, ఇందు ప్రియా, ప్రియా వల్లభి నటించారు.

రేపు సమన్వయకర్త మక్బూల్ పర్యటన

ఎన్పీకుంట: కదిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు మండల పరిధిలోని గొకనపల్లి పంచాయతీ కమ్మగుట్టపల్లిలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమవుతారన్నారు. అక్కడి నుంచి టీఎస్పల్లి, మరికొమ్మదిన్నె పంచాయతీలలో పర్యటిస్తారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, డైరెక్టర్లు, చైర్మన్లు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మెసెంజరుకు సన్మానం

గాండ్లపెంట: స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మెసెంజరుగా పనిచేస్తున్న జంపాల రమణను ఎంఈఓలు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. రమణ గత నెల జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. దీంతో ఎంఈఓ-1 క్రిష్ణానాయక్, ఉపాధ్యాయులు రమణకు పూలమాల వేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ యూనియన్ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, షంషీర్, హైదర్వలీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


కలెక్టర్ అరుణ్బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డి

పుట్టపర్తి అర్బన్: పలువురు రెవెన్యూ అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డి కలెక్టరేట్కు విచ్చేసి కలెక్టర్ అరుణ్బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్లో భారతి, రామాంజనేయ రెడ్డి, అన్వర్ హుస్సేన్, శ్రావణి, శ్రీనివాసులు, ముదిగుబ్బ తహసీల్దార్గా సరస్వతి, తలుపుల తహసీల్దార్గా రామకుమారి, పుట్టపర్తి తహసీల్దార్గా వేణుగోపాల్, ధర్మవరం తహసీల్దార్గా రమేష్, రొద్దం తహసీల్దార్ లక్ష్మీనారాయణ, తదితరులు కలెక్టరేట్కు విచ్చేసి జాయినింగ్ లెటర్లు అందజేసి కలెక్టర్, జేసీ, డీఆర్ఓలకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బత్తలపల్లి తహసీల్దార్గా శివశంకర్నాయక్..



బత్తలపల్లి: బత్తలపల్లి తహసీల్దార్గా శివశంకర్నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

శుభాకాంక్షలు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శివశంకర్నాయక్ను వైఎస్సార్సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, పోట్లమర్రి సర్పంచు అక్కిం దామోదర్, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఎస్సీ సెల్ నాయకులు మునలప్ప, మైనార్టీ నాయకులు షేక్షావలి, నాయకులు బండి నాగభూషణ, వరిమడుగు నారాయణరెడ్డి, వెంగన్న, లింగమయ్య, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు ఎస్ఐగా వంశీకృష్ణ

ఓడీచెరువు: మండల నూతన ఎస్ఐగా వంశీకృష్ణ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

కనగానపల్లి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



కనగానపల్లి: కనగానపల్లి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఓడీసీ నుంచి ఇక్కడికి బదిలీ చేశారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పెట్టి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామన్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలన్నారు.

ధర్మవరం తహసీల్దార్గా రమేష్

ధర్మవరం రూరల్: ధర్మవరం తహసీల్దార్గా ఎన్పీ రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తలుపుల తహసీల్దార్గా రామకుమారి



తలుపుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్గా పి.రామకుమారి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని తెలిపారు.

నల్లమాడ తహసీల్దార్గా నాగభూషణం



నల్లమాడ: మండల నూతన తహసీల్దార్గా జీ. నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లో సూపరింటెండెంట్గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికొచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఇన్చార్జ్ తహసీల్దార్గా విధులు నిర్వహించారు.

తాడిమర్రి తహసీల్దార్గా నజ్మాబాను..



తాడిమర్రి: మండల తహసీల్దార్గా నజ్మాబాను సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు నంద్యాల జిల్లా డొల్లపాడుకు బదిలీ అయ్యారు. దీంతో కర్నూలు జిల్లా పత్తికొండ తహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్న నజ్మాబాను బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలు, రైతులకు ఉత్తమ సేవలు అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

ముదిగుబ్బ తహసీల్దార్గా సరస్వతి

ముదిగుబ్బ: మండల తహసీల్దార్గా సోమవారం సరస్వతి బాధ్యతలను చేపట్టారు. అధికారులను సమన్వయం చేసుకొని ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. తహసీల్దార్కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు